
# వెన్నెల పంచే చందమామ

- కె. గోదావరిశర్మ



"మీకు చంద్రుడంటే ఎక్కువ ఇష్టమా, వెన్నెలంటే ఎక్కువ ఇష్టమా?" సరదాగా అడిగింది భావన.

ఆ ప్రశ్నకు వెంటనే జవాబు చెప్పలేకపోయాడు మూర్తి. దానిక్కారణం. అలాంటి ప్రశ్నలుంటాయని అతనికి ఇంతవరకు తెలియకపోవడమే. ఇప్పుడుజవాబు తను వెతుక్కోవడం కంటె ఆమెనుంచే రాబట్టడం మంచిదనిపించింది. "మరి నీకో?" అన్నాడు.

"నాకు వెన్నెలే ఎక్కువ ఇష్టం" అంది భావన.

ఆమె ప్రశ్న వేసిన ది తననుంచి జవాబు ఆశించి కాదనీ, ఆమె చెప్పదలుచుకున్నది చెప్పడం కోసమేనీ అనిపించింది మూర్తికి. ఇంకా చెప్పనిద్దామని, "ఎందుకని?" అన్నాడు.

"చంద్రుడిని దూరంనుంచి చూడడమే తప్ప చేతితో అందుకోలేం. వెన్నెలయితే దోసిళ్లతో పట్టి తాగొచ్చు. ఇంకా చిక్కగా ఉంటే చక్కగా కొరుక్కు తినవచ్చు..." తన్మయత్వంతో చెప్పింది భావన.

ఆమెవైపు ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు మూర్తి. అతడికి కించిత్ భయం కూడా వేసింది.

** ** **

భావన, ఎం.ఎ.(తెలుగు), మూర్తి బి.ఇ. (సివిల్) - కాబోయే భార్యాభర్తలు. పెళ్లి సెటిలయింది కనుక అప్పుడప్పుడు కాబోయే అత్తవారింటికి వస్తున్నాడు మూర్తి. మొదట్లో మొహమాటపడినా, భావనే ప్రోత్సహిస్తూంటే కాదనడం ఎందుకనుకున్నాడు. క్రమంగా పరిచయం పెరిగినకొద్దీ పరిచయం పెరగడమే మంచిదనిపిస్తూంది అతడికి. అపరిచితులు పెళ్లి చేసుకుని సరాసరి కాపురం పెట్టెయ్యడం - బ్లూప్రింటు, ప్లాను లేకుండా సరాసరి కట్టడం పని ప్రారంభించడం లాంటిదనిపించింది.

మూర్తి తెలివైన వాడే. చదువులోను, తరవాత ఉద్యోగంలోనూ మంచి మార్కులూ రిమార్కులూ సంపాదించిన వాడే. ఆ తరవాత పెళ్లి కుదరడం, భావనతో స్నేహం పెరగడం కూడా అతడికి కొత్త జ్ఞానాన్నిచ్చాయి. అసలు నిజానికి పుస్తక జ్ఞానంకన్న ప్రపంచజ్ఞానం గొప్పదనీ, అది తనకి ఇప్పుడిప్పుడే అలవడుతున్నదనీ కూడా గ్రహించాడు మూర్తి. దీనికి కారకురాలయిన భావన అంటే అతడికి ఆరాధనా భావం క్రమంగా పెరగసాగింది.

మూర్తి తల్లితండ్రులకి ఒక్కడే సంతానం. అందుచేత అన్నదమ్ములతో, అక్కచెల్లెళ్లతో కలిసి నేర్చుకోవలసిన విషయాలేవీ నేర్చుకోలేదు. చెప్పుకోదగ్గ గాఢ స్నేహము ఎవరితోనూ లేకపోవడం వల్ల సమవయస్కులతో కలిసి పొందవలసిన అనుభవాలూ పొందలేదు. నెరసి అతడి ప్రపంచం చాలా చిన్నది. ఆ చిన్న ప్రపంచంలో అతడి జీవిత శకటం పెద్దగా

ఒడిదుడుకులేవీ లేకుండా సాగింది. అతడు చేసిన ఘనకార్యాలూ లేవు, పొందిన ఘోర పరాజయాలూ లేవు.

భావనతో పరిచయం అతడి ఊహకి రెక్కలిచ్చింది. అతడి ప్రపంచాన్ని విస్తరింపజేసింది. కొత్త రుచులు చవిచూపింది. జీవితానికి కొత్త నిర్వచనం ఇచ్చింది. అందంగా, ఆనందంగా, అర్థవంతంగా జీవించాలనే కోర్కె కలిగించింది.

కారణం భావన విలక్షణమైన వ్యక్తిత్వం కలది. అందమైనది, చురుకైనది - అందుచేత ఆమె చుట్టూ ఒక అయస్కాంత క్షేత్రం ఏర్పడి, ఆ పరిధిలోకి వచ్చిన వాళ్లందరినీ ఆకర్షిస్తుంది. ఆమె ముగ్గురు అక్కచెల్లెళ్లలో మూడవది. తల్లికి గల సంగీతాభిరుచి వల్ల వారింటిలో మొదటినుంచీ ఒక కళాత్మక వాతావరణం నెలకొన్నది. ఆమె తండ్రి కూడా లౌకిక విలువలకంటె నమ్ముకున్న ఆదర్శాలకే ప్రాధాన్యత నిచ్చినవాడు. అందుచేత అమ్మాయిలు ముగ్గురూ చూడముచ్చటగా పెరిగారు. భావన సాహిత్య విద్యార్థిని. మార్కులకోసం, డిగ్రీకోసం చదివే చాలామందిలా కాక, సాహిత్యాన్ని చదవాల్సిన పద్ధతిలో చదివి రసానందాన్ని పొందిన యువతి. అదికాక సహజాతమైన లాలిత్యం, భావుకత, సౌందర్యదృష్టి ఆమెను అపురూపమైన వ్యక్తిగా చేశాయి.

అందుచేత ఆ సాయంత్రం మునిమాపువేళ దాటి వెన్నెలలు విరుస్తున్న సమయంలో ఆమె కాబోయే వరుడితో అలాంటి సరస సంభాషణ చెయ్యడంలో ఆశ్చర్యం లేదు. ఆమె పద్ధతే అది. మూర్తికి మాత్రం ఆమె ప్రతిమాటా ఆశ్చర్యమే. ప్రతి విలాసహేలా కొత్త అనుభూతే. ప్రతి రసావిష్కరణా త్వరలో అందుకోబోయే స్వర్గంలోకి తెరిచిన కిటికీయే. కాని అది తనకూ ఆమెకూగల అంతరాన్ని స్పష్టంగా నిరూపించినప్పుడు మాత్రం భవిష్యత్తు గురించి అతడికి కించిత్ భయం వెయ్యడం కూడా సహజమే కదా! ఆ సాయంత్రం అతడికి కలిగిన భయం అలాంటిదే.

**    **    **

పదేళ్ల తరవాత......

భావన వంటింట్లో అష్టావధానం చేస్తున్నది. అవధానులు సభల్లో చేసేదానికన్న ఇది కష్టావధానం. పెద్ద కూతురికి యూనిఫారం వేసి టిఫిన్ పెట్టి కాన్వెంటుకి తయారు చెయ్యాలి. రెండో కూతురు చేసిన రెండు వేళ్ల పనిని శుభ్రం చెయ్యాలి. పనిమనిషికి బట్టలసబ్బు అయిపోయిందంటే తెచ్చుకోవడానికి డబ్బులివ్వాలి. రేడియో గదిలో కూచుని రాసుకుంటున్న మొగుడికి రెండోసారి కాఫీ ఇవ్వాలి. కూరలవాడు నిలబడి పోయాడు, వీధిలోంచి అరుస్తున్నాడు. వెళ్లి ఆ పని చూడాలి. పక్కింటివాళ్ల పాప స్టీలుగ్లాసు పట్టుకు నిలుచుంది, దానికి తలకొట్టే గ్లాసుడు పంచదార ఇవ్వాలి. తరవాత ఎదురింటి వాళ్లకి నంబరిచ్చి గ్యాసు ఆఫీసుకి ఫోను చెయ్యమని చెప్పాలి. ముందు కరెంటు పోకుండా గ్రైండరులో పచ్చడి రుబ్బుకోవాలి. ఇవి తక్షణ సమస్యలు. ఇవికాక భూత, భవిష్యత్, వర్తమానాలకి సంబంధించిన శతాధిక విషయాలు, సమస్యలు, ఆలోచనలు ఆమె తలలో తిరుగుతూనే ఉంటాయి. అంచేత ఆ సమయంలో భావన - ఏక కాలంలో అష్టావధానం, శతావధానం కూడా చేస్తున్న మనిషిలా ఉంటుంది. తేడా ఏమిటంటే అవధాని గారికి సన్మానాలూ చప్పట్లూ ఉంటాయి. గృహిణికి ఒక్క మెచ్చుకోలు మాట కూడా ఉండదు.

ఆ వంటింట్లో ఉన్న గ్యాస్ స్టౌ, గ్రైండరు, ఫ్రిజ్ మొదలైన యంత్రాలలో తనూ ఒక యంత్రం అయిపోయింది భావన. అలాంటి యాంత్రికమైన స్పీడు. చాకచక్యం ఉంటే గాని పనులు కావు. తనతోబాటు అందరినీ తొందరచేస్తూ ఉండడం, పిల్లల్ని కసురుకోవడం, పనిమనిషి మీద కేకలు వెయ్యడం, భర్తని విసుక్కోవడం, తనమీద తనే కోపం తెచ్చుకోవడం, బి.పి. పెంచుకోవడం




నిస్పృహాయంగా చివరికి 'ఛీ ఛీ, ఏం బతుకు!' అని విస్పృహ పొందడం - ఆమెకి సర్వసాధారణం అయి పోయాయి. కనీసం 'గతముతలచి వగచే' సౌఖ్యానికైనా ఆమె నోచుకోలేదు. జీవితం తరుముకొస్తూ ఉంటే నాన్‌స్టాప్‌గా పరుగులు తీసే లేడికి సింహావలోకనపు లగ్జరీ ఏదీ?

ముందు గదిలో కూచుని ఏకాగ్రతతో ఏదో పత్రికకి రివ్యూ రాస్తున్నాడు మూర్తి. అది ముందు రోజు సాయంత్రం జరిగిన సంగీత కచేరీ మీద రివ్యూ. మూర్తికి పెళ్లయిన ఆరు నెలలలో భార్య భావన ధర్మమా అని సంగీతంలో ఆసక్తి కలిగింది. అది వ్యసనంగా పరిణమించింది. జూనియర్ ఇంజనీరు నుంచి అసిస్టెంట్ ఇంజనీరుగా హోదా పెరగడంతోటే ఊళ్లో పబ్లిక్ రిలేషన్సూ ఇతర వ్యాపకాలూ ఏర్పడ్డాయి. స్థానిక సంగీత సభకు ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఫంక్షన్లలో ముఖ్య అతిథిగా పిలిస్తే వెళ్లి, ఉపన్యాసాలిస్తాడు. అతడు అంతకంతకీ ఊళ్లో వ్యాపారాలతో బిజీ అవుతూంటే భావన ఇంటి పనులతో బిజీ అవసాగింది. ఇద్దరు పిల్లలు పుట్టి ఇద్దర్నీ ఎమోషనల్‌గా దగ్గరచేసినా, ఫిజికల్‌గా దూరంకాకతప్పలేదు. ఇద్దరూ ఒకరితో ఒకరు కలిసి గడిపే సమయం క్రమంగా తక్కువకాసాగింది. సంగీత సభలకి ఇద్దరి తరవునా మూర్తి ఒక్కడే వెళ్లిరావడం జరుగుతూంది. వచ్చాక ఏ రాత్రి పడుకునే సమయంలోనో కచేరి వివరాలు ఆమెకి చెపుతాడు. ఆమెకి వినాలని మనసులో కోరిక వున్నా, రోజంతా పనిచేసి అలసిపోవడం వల్ల శరీరం స్వాధీనంలో వుండదు. కమ్ముకువచ్చే నిద్రవల్ల సగం వింటూనే నిద్రపోతుంది. "పోనిద్దురూ, మీరు వెళితే నేను వెళ్లినట్టు కాదూ" అంటుంది మర్నాడు ఉదయం. సగం సిన్సియర్‌గా, సగం నిస్పృహగా.

"వంట అయిపోయింది" తొమ్మిదింపావు అవుతూండగా వంటింట్లోంచే కేకవేసింది భావన. మూర్తి పెన్ను మూడిచి, కాగితాలు డ్రాయర్లో పెట్టి లేచాడు. వంటింటి గుమ్మం దగ్గరికి వెళ్లి "తొందరలేదు" అన్నాడు తాపీగా.

"అదేం?" ఆమె ఆశ్చర్యంలో చికాకు కూడా ఉంది.

"ఇవాళ ఆఫీసుకి శలవు పెట్టేను."

"ఎప్పుడు?"

"నిన్ననే."

"మరి చెప్పలేదేం? తొందరలేదంటే తాపీగా చేసుకుందును కదా వంట! అయిన ఎందుకూ శలవు?" చాలా రోజుల తరువాత రొటీన్ జీవితంలో ఒక చిన్న ఆశ్చర్యం, ఎదురు చూడని సంఘటన, ఆమెకు కుతూహలాన్నీ రిలీఫ్‌నీ కూడా ఇచ్చాయి.

"ఏం లేదు. ఊరికే. పనేమీ లేదు. ఉన్న ఆఫీసు పని కూడా మాటేసి ప్రశాంతంగా, ఖాళీగా కూచుందామనే శలవుపెట్టాను. నీకు వంటపని అయిపోయింది కాబట్టి సాయంకాలం దాకా ఖాళీయే కద! ఇంకేమైనా పనులుంటే రేపటికి వాయిదా వేసుకో. ముందే చెపితే ఒంటిగంట దాకా వంటపనే చేస్తావని - చెప్పలేదు" అన్నాడు మూర్తి.

భావన హృదయంలో కొంచెం ఉత్సాహం తొంగి చూసింది. "ఒక్క అరగంట టైము ఇవ్వండి. చిన్న చిన్న పనులు ముగించుకుని వస్తాను. చిన్నదాన్ని పడుకోబెట్టడం, నేను స్నానం చేసి దేవుడికి దీపం పెట్టుకుని రావడం. తరవాత మీ ఇష్టం" అంది.

మూర్తి మళ్లీ బెడ్‌రూమ్‌లోకి వచ్చి మంచంమీద నడుం వాల్చేడు.

పది గంటలకి పనులన్నీ ముగించుకుని కడిగిన ముత్యంలా పడగ్గదిలోకొచ్చింది భావన.

రెప్ప వెయ్యకుండా తననే చూస్తున్న భర్తతో, "ఏమిటి అలా చూస్తున్నారు?" అంది.

"ఈ పదేళ్లలో నీలో వచ్చిన మార్పు..."

ఆమె నిర్లిప్తంగా నవ్వేసింది, ఓడిపోయిన దానిలా. "మార్పు జీవనధర్మం" అంది. జరిగిన దానిని సమర్థిస్తున్నట్టు.

"అది సరే! కాని వచ్చిన మార్పు మనకి అనుకూలంగా ఉందా? పూర్వంకన్న ఆనందంగా ఉన్నామా మనం?" ముంజేతి కంకణానికి అద్దం చూపిస్తూ అన్నాడు మూర్తి.

"ఏం అనుకోండి! ఏం చేస్తాం? మనం చెయ్య

# వెన్నెల పంచే చందమామ

గలిగింది ఏమైనా ఉందా?''

''ప్రయత్నిస్తే ఏమైనా చెయ్యగలమేమో!'' నవ్వ జెపుతున్నట్టు అన్నాడు.

ఆమె తల అడ్డంగా ఊపింది.

''పిల్లలు కాస్త పెద్దవాళ్లయితే నీకింత ఇబ్బంది ఉండదేమో'' అన్నాడు, ఓదార్చుతున్నట్టు.

భావన నవ్వి, ''ఆశావాదం మంచిదే, కాని... ప్రయోజనం లేదు. కాలం ముందేకేగాని వెనక్కి వెళ్లదు'' అంది విషాదంగా.

ఆశావాదం అన్నది చిన్నపిల్లల ఆట అయినట్టు ఆమె ఆ స్థాయి నుంచి బాగా ఎదిగిపోయినట్టు, జీవన విషాదాన్నిబాగా అవగాహనచేసుకున్నట్టూ కనిపించింది భావన అతడికి. ఆమె సీరియస్‌గా మాట్లాడితే అతడు జవాబు చెప్పలేడు, ఇప్పటికీ.

ఏం చెప్పి ఆమెకు ఉల్లాసం, ఆహ్లాదం కలిగించ వచ్చా అని అతడు ఆలోచిస్తూ ఉండగా డోర్ బెల్ మోగింది. భ్రుకుటి ముడిచి లేచాడు మూర్తి.

ఆఫీసు అటెండరు. ఆడిటర్ వచ్చాడట, ఒక్క సారి మూర్తిని ఆఫీసుకి వచ్చి వెళ్లమని.

''ఇంట్లో పనుందని శలవు పెట్టేను కదా, చిన్నవే'' అన్నాడు చికాకుగా. కాని వెళ్లక తప్పదని తెలుసు అతడికి. ''సరే, వస్తున్నానని చెప్పు''! అని పంపించేశాడు వాణ్ణి.

విసుగ్గా బట్టలు వేసుకుంటున్న భర్తని చూసి తన ఓటమే జయించిందన్నట్టు నవ్వింది భావన. ''వడ్డిస్తాను, భోంచేసి వెళ్లండి'' అంటూ నిట్టూర్చిలేచింది.

** ** **

మరో పదేళ్ల తరవాత......

ఓనాటి సాయంకాలం చీకటి పడుతుండగా జీపు దిగి ఇంట్లోకి నడిచాడు డివిజనల్ ఇంజనీరు మూర్తి. ఇంట్లో కరెంటు లేదు. కొన్ని గదుల్లో కొవ్వొత్తులు వెలుగుతున్నాయి.

అతడు బట్టలు మార్చుకుంటూ ఉంటే చిన్న కూతురు కాఫీ తెచ్చి ఇచ్చింది. ''అమ్మ లేదా అమ్మా?'' అడిగాడు మామూలుగా.

''గుడికెళ్లిందండీ, పక్కింటి అత్తయ్య గారితో''

లుంగీ కట్టుకుని పెరట్లోకెళ్లి కాళ్ళు, చేతులు, ముఖం కడుక్కొని వచ్చాడు. ఫ్యాను లేకపోవడం వల్ల గదిలో గాలిలేక ఉక్కగా ఉంది. డాబామీదికి వెళ్తే బాగుండుననిపించింది.

''అక్క కూడా లేదమ్మా, ఇంట్లో?''

''డాబామీద ఉందండీ!''

అంటే ఆ అబ్బాయి వచ్చాడన్నమాట!

పెద్దమ్మాయి స్పందనకి పెళ్లి నిశ్చయమైంది. మాఘమాసంలో చెయ్యాలని ప్రయత్నం. ఈలోగా - కుర్రాడికి ఉన్న ఊళ్లోనే ఉద్యోగం కాబట్టి - అప్పుడప్పుడు వచ్చి వెళుతూ ఉంటాడు. పోనీ, అదీ మంచిదే! ఒకరి గురించి ఒకరు బాగా తెలుసు కుంటారు!

పైకి వెళ్లాదా వద్దా అని ఒక్కక్షణం తటపటా యించి, షర్టు వేసుకుని వెళ్లడానికే నిశ్చయించు కున్నాడు.

అతడు మేడ మెట్లెక్కుతూంటే పిట్టగోడ దగ్గర నిలబడి మాట్లాడుతున్న స్పందన, ఆ అబ్బాయి క్రమ క్రమంగా కనిపించారు అతడికి. వాళ్ల వెనక దూరంగా దిగంత రేఖ మీద చంద్రుడు ఉదయిస్తున్నాడు, డాబా మీదకి వెన్నెల పంచుతూ, ఆ వెన్నెల వెలుగులో స్పందన - ఇరవై ఏళ్ల క్రితం భావన ఎలా ఉండేదో సరిగ్గా అలాగే ఉందనిపించింది మూర్తికి. స్పందన తల్లి నోట్లోంచి ఊడిపడినట్టుంటుంది. అతడికి అనిర్వచ నీయమైన ఆనందం ఏదో కలిగి, ఆ పైమెట్టుమీదే నిలబడిపోయాడు.

అతడి రాకని గమనించనివాళ్లిద్దరూ తమలోకంలో తామున్నారు. వాళ్ల మాటలు అతడికి స్పష్టాస్పష్టంగా




వినిపిస్తున్నాయి.

''మీకు చందమామ ఎక్కువ ఇష్టమా, వెన్నెల ఎక్కువఇష్టమా?'' అడుగుతూందిస్పందన. అప్పుడు ఆమె తల్లి తనని ఇదే ప్రశ్న వేసింది. ఈ అబ్బాయి ఏం చెపుతాడా అని కుతూహలంగా విన్నాడు మూర్తి.

ఏం చెపుతాడు? ఇరవై ఏళ్ల క్రిందట తను ఏం సమాధాం చెప్పగలిగేడో, అదే. తెల్లబోవడం, తెప్ప రిల్లడం, మాటలు వెతుక్కోవడం, అతుక్కోవడం.

అంతలో ''నాన్నా అమ్మొచ్చింది'' అని క్రింద నుంచి చిన్నకూతురు కేక వినిపించింది. మెట్లు దిగి వచ్చేశాడు.

భార్య తెచ్చిన ప్రసాదం కోసం చెయ్యి చాపుతూ, ''కాలం ముందుకే గాని వెనక్కి నడవదంటావు నువ్వు! కాదు. ముందుకి నడిచినట్టు కనిపిస్తుంది గాని మళ్లీ మళ్లీ వెనక్కే వస్తుంది. చరిత్ర పునరావృత మౌతుంది'' అన్నాడు.

''అలా అని ఇవాళే జ్ఞాని ఎవరైనా ఉపదేశించారా మీకు?'' అంది భావన, తనకి అవాటైపోయిన వ్యంగ్య స్వరంతో.

''ఔను! ఆ జ్ఞాని ఎవరో కాదు, నీ కూతురే'' అన్నాడు మూర్తి, ప్రసాదం కళ్లకద్దుకుని నోట్లో వేసుకుంటూ.

అదేమిటన్నట్టు చూసింది భావన.

''ఇరవయ్యేళ్ల క్రిందట - గుర్తుందా. మన పెళ్లి ముందు డాబా మీద నువ్వు నన్నడిగావు. మీకు చంద్రుడు ఇష్టమా, వెన్నెల ఇష్టమా అని! ఇందాకా మన పెద్దమ్మాయి ఆ అబ్బాయిని సరిగ్గా అలాగే అడుగుతూంది'' చిరునవ్వుతో చెప్పేడు మూర్తి.

భావన కళ్లలో గతస్మృతుల దీపకాంతీ, పెదవుల మీద పరాజయపు చేదు నిట్టూర్పూ ఒకేసారి వెలు వడ్డాయి. ''అయితే? ఏమిటట?'' అంది, విలాసమూ విసుగూ కాని ధోరణిలో.

మూర్తి డైనింగ్ టేబుల్ దగ్గరున్న ఓ కుర్చీ లాక్కొని కూర్చున్నాడు. ''దేవదాసు పాట గుర్తుందా - చివురించిన పూతీగె నేరియగా, విరితావులు దూరాలై చనేమలే - అని? పూల పరిమళాలు పూలనుండి దూరంగా వెళ్లిపోయినట్టే, చంద్రుడి వెన్నెలలు కూడా అతడి నుండి దూరంగా వెళ్లి పోతూనే ఉంటాయి. ఏరోజు వెన్నెలలు ఆరోజు లోకాన్ని వెలిగించి చీకట్లలో కలిసిపోతాయి. అయినా చంద్రుడు కొత్త వెన్నెలలు కురుస్తూనే ఉంటాడు...''

''దీర్ఘ కవితలు వినడానికి టైము లేదు నాకు, క్లుప్తంగా మినీ కవితలా చెప్పండి'' అంది భావన, నడుంమీద చేతులు పెట్టుకుని.

''వస్తున్నా, వస్తున్నా! మీ ఆడవాళ్లు చంద్రుడి లాంటి వాళ్లు. ఇరవై ఏళ్ల క్రిందట నువ్వు. ఇవాళ మనమ్మాయి. తరవాత ఇంకో అమ్మాయి. ఇంకో అమ్మాయి - ఇలా నిరంతరంగా మాలాంటి వాళ్ల మీద మీ వెన్నెల ప్రసరిస్తూనే ఉంటారు. వెన్నెల కోల్పోతున్నా అదే మీకు ఇష్టమంటారు...'' అన్నాడు మూర్తి, ఆరాధనగా ఆమెవంక చూస్తూ.

''ఔనౌను! మీరిలా మా త్యాగబుద్ధిని పొగిడేసరికి మేం ఉబ్బితబ్బిబ్బయిపోయి ఇంకా ఇంకా మీ కోసమే బతుకుతూ ఉంటాం. కదూ? చూడండీ, మొదట్లో కొత్త కాపురాలన్నీ ఒక్కలాగే ఉంటాయి. ఏళ్లు గడిచిన కొద్దీ - నన్ను చూడండి - అందమైన చందమామనే ఒకప్పుడు, అట్లపెనంలా తయారయ్యాను ఇవాళ! కాని ఎల్లకాలం ఇలాగే ఉంటామనుకోకండి! నా కూతురు నాకన్నా తెలివైనది...'' అంది భావన, కోపంగా.

''మరీ అన్యాయంగా మాట్లాడుతున్నావు. అట్ల పెనం అనకపోతే అమావాస్య చంద్రుడు అనొచ్చు కదా'' అన్నాడు మూర్తి.

కరుగ్గా మాట్లాడడానికిది సమయం కాదని గ్రహించింది. భావన, ''అమావాస్యలూ గ్రహణాలూ ఎన్నాళ్లు సార్, మీ చందమామకి?'' దగ్గరగా వచ్చి అడిగింది.

మూర్తి బతుకు జీవుడా అనుకుని, ''ఇదిగో, ఇవాళ్టితో సరి! ఇకముందంతా వెన్నెలే వెన్నెల! చంద్రుడి చుట్టూ గుడికట్టి ఉంటుంది'' అన్నాడు ఆమె నడుంచుట్టూ చెయ్యివేస్తూ.